నేడు జాబ్‌మేళా

టెక్కలి : టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో మంగళవారం నిరుద్యోగులకు ఉపాధి కల్పన దృష్ట్యా జాబ్‌మేళా నిర్వహించనున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి ఆధ్వర్యాన నిర్వహించే ఈ జాబ్‌మేళాకు డిగ్రీ, ఇంటర్ ఉత్తీర్ణత సాధించిన నిరుద్యోగ అభ్యర్థులు హాజరుకావాలని కోరారు. 18 నుంచి నుంచి 45 ఏళ్ల వరకు వయసు గల వారు అర్హులని అన్నారు. ఈ జాబ్‌మేళాలో రెండు బహుళ జాతి కంపెనీలు పాల్గొంటాయని చెప్పారు. ఆసక్తి గల నిరుద్యోగులు తమ ఆధార్ కార్డులు, బయోడేటా ఫారం, పాస్‌పోర్టు సైజ్‌ఫొటోలు తీసుకుని హాజరు కావాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ట్రాఫిక్ అస్తవ్యస్తం

- జి.టి రోడ్డుపై అడ్డదిడ్డంగా పార్కింగ్
- రోడ్డు దాటేందుకూ అవస్థలు
- ప్రత్యామ్నాయాలపై దృష్టిసారించని అధికారులు
- కార్పొరేషన్ అధికారులు, పోలీసులకు పట్టని జనం అవస్థలు

జి.టి రోడ్డులో వాహనాల మధ్య నుంచి దాటేందుకు అవస్థలు పడుతున్న పాదచారులు

శ్రీకాకుళం నగరంలో ట్రాఫిక్ సమస్య నానాటికీ జఠిలమవుతోంది. ప్రత్యేకించి సంక్రాంతి పర్వదినాల్లో జి.టి రోడ్డు మీద ప్రయాణించాలంటే నానాపాట్లు పడాల్సి వస్తోంది. సాధారణ రోజుల్లోనే ట్రాఫిక్ అధికంగా ఉండే ఆ మార్గం, ప్రస్తుతం పండగ రోజులు కావడంతో జనంతో కిక్కిరిసిపోతోంది. వాహనాల నిలుపుదల కోసం ఏర్పాటు చేసిన సెంటర్ పార్కింగ్ వాహనాలతో నిండిపోతోంది. కనీసం రోడ్డు దాటేందుకూ జనం అవస్థలు పడుతున్న పరిస్థితి నెలకొంది. వారం, పది రోజులుగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నా అటు ట్రాఫిక్ పోలీసులు గానీ, ఇటు మున్సిపల్ అధికారులు గానీ ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై కనీసం దృష్టిసారించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

శ్రీకాకుళం నగర జనాభా 1.30 లక్షలు ఉంది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా రోడ్ల విస్తరణ లేకపోవడంతో ట్రాఫిక్ సమస్యలు మాత్రం తప్పడం లేదు. నగరంలో ప్రధానంగా జి.టి రోడ్డు, రామలక్ష్మణ కూడలి, పాతబస్టాండ్, డే అండ్ నైట్ కూడలి, ఆస్పత్రి రోడ్డు, మార్కెట్ ప్రాంతం అత్యంత రద్దీగా ఉండే ప్రాంతాలు. వీటిలో జి.టి రోడ్డు, మార్కెట్టు ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ సమస్యలు ఎక్కువగా తలెత్తుతున్నాయి. జి.టి రోడ్డు వాణిజ్యపరంగా అభివృద్ధి చెందడంతో ఆ ప్రాంతం నిత్యం జనంతో రద్దీగా ఉంటోంది. ఇక్కడ ప్రధానంగా వస్త్ర దుకాణాలు, మొబైల్, బంగారు, స్వీట్ దుకాణాలు, హోటళ్లు, లాడ్జీలు ఉన్నాయి. వీటిలో అత్యధికంగా వస్త్ర దుకాణాలే ఉన్నాయి. వస్త్ర వ్యాపారం అధికంగా సాగుతుండడంతో కొత్త దుకాణాలతో పాటు పాత బ్రాంచీలూ ఏర్పాటవుతున్నాయి. ఎస్ఆర్ షాపింగ్ మాల్స్‌కు సంబంధించి ఇదే రోడ్డులో రెండు దుకాణాలు ఉన్నాయి. ఈ ఏడాది వాటి పక్కనే సిఎంఆర్ షాపింగ్ మాల్ ఏర్పాటైంది. జి.టి రోడ్డుపై సూర్యమహల్ కూడలి వద్ద సౌత్ ఇండియా షాపింగ్ మాల్, ఏడు రోడ్ల కూడలి సమీపంలో ఆర్‌కె స్టోర్స్ ఉన్నాయి. వీటితో పాటు కోణార్క్ రెడీమేడ్స్, రాజా సిల్క్ మందిర్, సిటీ షాపింగ్ మాల్‌తో పాటు ఇతర అనేక వస్త్ర దుకాణాలు, హోటళ్లు ఉన్నాయి. వీటిలో అత్యధిక దుకాణాలకు సెల్లార్లు లేవు. కొన్నింటికి సెల్లార్లు లేకపోయినా, ప్రత్యేకంగా పార్కింగ్ స్థలం కేటాయించారు.

అడుగడుగునా వ్యాపారుల ప్రయోజనాలే...

ప్రభుత్వాలు మారుతున్నా ప్రజాప్రతినిధులు వ్యాపారుల ప్రయోజనాల కోసం పనిచేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. భవనాల అనుమతుల దగ్గర నుంచి జిటి రోడ్డులో సెంటర్ పార్కింగ్ వరకు అంతా వారనుకున్నట్లుగా సాగుతోందన్న చర్చ నడుస్తోంది. వాణిజ్య ప్రాంతాల్లో నిర్మిస్తున్న భవనాలకు కచ్చితంగా పార్కింగ్ కోసం కొంత స్థలాన్ని కేటాయించాల్సి ఉంటుంది. బహుళ అంతస్తుల భవనాలకు సెల్లార్లు నిర్మించుకోవాలి. ఇవేవీ లేకపోయినా వ్యాపార, వాణిజ్య భవనాలకు ఇష్టానుసారంగా అనుమతులు ఇచ్చేశారు. కొందరు సెల్లార్లలో సైతం వ్యాపారాలు సాగించేస్తున్నారు. జి.టి రోడ్డులో సెంటర్ పార్కింగ్ నిర్ణయం కూడా వారి ప్రయోజనాల కోసమేనన్న చర్చ గతంలోనే సాగింది. దుకాణాలు, షాపింగ్‌ల వద్ద వాహనాలు ఏర్పాటు చేస్తే తమ వ్యాపారాలకు ఇబ్బందులు వస్తాయనే ఉద్దేశంతో వ్యాపారులంతా మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావును కలిసి విన్నవించడంతో సెంటర్ పార్కింగ్ అమల్లోకి వచ్చింది.

ట్రాఫిక్ పోలీసుల వైఫల్యం

ట్రాఫిక్ ఇబ్బందులకు పోలీసుల వైఫల్యం ప్రధానంగా కనిపిస్తోంది. ట్రాఫిక్‌ను చక్కదిద్దేందుకు అనేక ఇతర మార్గాలు ఉన్నాయి. నగరంలో అత్యంత ట్రాఫిక్ రద్దీని ఎదుర్కొంటున్న జి.టి రోడ్డులో పలుచోట్ల పార్కింగ్ ప్రాంతాలను గుర్తించి ద్విచక్ర వాహనాలకు పార్కింగ్ సౌకర్యం కలిగిస్తే పాదచారులు, వాహనదారులకు ఇబ్బందులు కొంతమేర తీరుతాయి. గతంలో ఇదే విధానాన్ని పోలీసులు అమలు చేశారు. సిఎం, ఇతర విఐపిలు, వారి బాస్ ఎస్‌పి వచ్చినప్పుడు హడావుడి చేసే పోలీసులు సామాన్య జనం పడుతున్న ఇక్కట్లను పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

పొట్టి శ్రీరాములు మార్కెట్ వద్ద రోడ్డు దాటేందుకు మార్గం లేక స్టాపర్ల మధ్యే నుంచే వెళ్తున్న మహిళలు

జిటి రోడ్డుపై ఇలా... కళింగ రోడ్డులో అలా...

శ్రీకాకుళం నగరంలో ట్రాఫిక్ నియమాలు అమలు చేయడంలో పోలీసులు భిన్నంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పాదచారులు, వాహనాలు రోడ్డు దాటేందుకు జిటి రోడ్డులో చాలా చోట్ల స్టాపర్లు పెట్టి మార్గం కల్పించారు. ఎస్ఆర్ షాపింగ్ మాల్ రెండు దుకాణాల దగ్గర రెండేసి పాయింట్లు ఇచ్చారు. సిఎంఆర్ షాపింగ్ మాల్ దగ్గర ఒక పాయింట్ ఇచ్చారు. అదే కళింగరోడ్డు దగ్గరకొచ్చేసరికి సుమారు 500 మీటర్ల పొడవునా రోడ్డు మధ్యలో స్టాపర్లను ఏర్పాటు చేశారు. మార్కెట్, పాతబస్టాండ్‌కు వచ్చే వారు చుట్టూ తిరిగి వెళ్తూ అవస్థలు పడుతున్నారు. మార్కెట్ ప్రాంతం వద్ద కనీసం జనం నడిచేందుకూ గ్యాప్ ఇవ్వలేదు.

పద్మవ్యూహంలో మార్కెట్ ప్రాంతం

నగరంలోని పొట్టి శ్రీరాములు పెద్ద మార్కెట్ ప్రాంతంలో ట్రాఫిక్ ఒక్కోసారి పద్మవ్యూహాన్ని తలపిస్తోంది. ఇష్టానుసారంగా లారీలను రోడ్డుకు అడ్డంగా నిలుపుతున్నారు. ఉదయం 11 గంటల వరకు లారీల నుంచి సరుకులను దించుతుంటారు. లారీల రాకపోకలతో ప్రతిరోజూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. వీటికితోడు రోడ్డపైన, దుకాణాల ముందు తోపుడుబళ్లు, సైకిళ్లపై వ్యాపారాలు సాగిస్తున్నారు. దీంతో తమ వాహనాలను నిలిపేందుకు స్థలం లేక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కోసారి పాదచారులు నడిచేందుకు కూడా వీల్లేని పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయి. వీటిపైనా మున్సిపల్, ట్రాఫిక్ పోలీసులు దృష్టిసారించి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అంతా కోరుతున్నారు.

ట్రాఫిక్ ఇబ్బందుల్లేకుండా చూస్తాం

జి.టి రోడ్డు, పొట్టి శ్రీరాములు మార్కెట్ ప్రాంతంలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడతాం. ఏడురోడ్లు, సూర్యమహల్ కూడళ్ల వద్ద స్టాపర్లను ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను మళ్లిస్తాం. జి.టి రోడ్డుపై వాహనాల రద్దీని తగ్గించేలా చూస్తాం. కళింగ రోడ్డులో మార్కెట్ ప్రాంతం వద్ద పాదచారుల రాకపోకలు సాగించేందుకు వీలుగా మార్గం కల్పిస్తాం.

- వి.నాగరాజు, శ్రీకాకుళం పట్టణ ట్రాఫిక్ సిఐ

మాట్లాడుతున్న డిఆర్‌ఒ వెంకటేశ్వరరావు

జిల్లాలో ఓటర్ల సంఖ్య 18.89 లక్షలు

జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లా వ్యాప్తంగా ఈ నెల 5 నాటికి 18,89,065 మంది ఓటర్లుగా ఉన్నట్టు జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం విలేకరులతో మాట్లాడారు. వారిలో 9,31,640 మంది పురుష ఓటర్లు, 9,48,299 మంది మహిళా ఓట్లర్లు, 126 మంది ఇతరులు ఉన్నారని వివరించారు. జిల్లాలో నియోజకవర్గాల వారీగా ఇచ్ఛాపురంలో 1,31,396 మంది పురుష, 1,38,165 మంది మహిళ, ఇతరులు 17 మంది, పలాసలో 1,07,496 మంది పురుష, 1,12,414 మంది మహిళ, ఇతరులు 21, టెక్కలిలో 1,17,977 మంది పురుష, 1,18,694 మంది మహిళ, ఇతరులు 9 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. పాతపట్నం నియోజకవర్గంలో 1,12,513 మంది పురుష, 1,13,168 మంది మహిళ, ఇతరులు 9 మంది, శ్రీకాకుళం నియోజకవర్గంలో 1,35,562 మంది పురుష 1,38,333 మంది మహిళ, ఇతరులు 29 మంది ఓటర్లు ఉన్నారని అన్నారు. ఆమదాలవలస నియోజకవర్గంలో 96,094 మంది పురుష, 97,610 మంది మహిళ, ఇతరులు 15 మంది, ఎచ్చెర్ల నియోజకవర్గంలో 1,23,370 మంది పురుష, 1,21,988 మంది మహిళ, ఇతరులు 13 మంది, నరసన్నపేట నియోజకవర్గంలో 1,07,232 మంది పురుష, 1,07,927 మంది మహిళ, ఇతరులు 13 మంది ఓటర్లు ఉన్నట్లు వివరించారు. 2024-25లో 18-19 వయసు గల యువత 19,315 మంది ఓటర్లుగా తమ పేర్లు నమోదు చేసుకున్నట్లు వివరించారు. మొత్తం ఓటర్ల జాబితాలో 80 ఏళ్లు దాటిన వారు 31,609 మంది ఉన్నారన్నారు. ఎప్పటిలాగే జిల్లాలో పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నట్లు వివరించారు. సమావేశంలో సి-సెక్షన్ సూపరింటెండెంట్ రాజేశ్వరరావు పాల్గొన్నారు.

రేపు దేహ దారుఢ్య పరీక్షలు వాయిదా

శ్రీకాకుళం : పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలకు సంబంధించి ఈనెల ఎనిమిదో తేదీన నిర్వహించాల్సిన దేహ దారుఢ్య పరీక్షలు 11వ తేదీకి వాయిదా వేసినట్లు ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 8వ తేదీన వైకుంఠ ఏకాదశి, శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా ఆరోజు నిర్వహించాల్సిన దేహ దారుఢ్య పరీక్షలు 11వ తేదీన నిర్వహించనున్నట్లు తెలిపారు. నోటిఫికేషన్ షెడ్యూల్ మేరకు ఎనిమిదో తేదీన మినహా మిగిలిన తేదీల్లో ఏటువంటి మార్పులు లేవని, దేహ దారుఢ్య పరీక్షలు యథావిధిగా సాగుతాయని స్పష్టం చేశారు. అభ్యర్థులు ఈ విషయాన్ని గమనించి కాల్ లెటర్‌లో తెలిపిన నిర్దేశించిన తేదీలు, సమయానికి హాజరు కావాలని సూచించారు.

బయో మెడికల్ వేస్టేజ్‌పై దృష్టి

మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

బయో మెడికల్ వేస్టేజ్‌పై సంబంధిత అధికారులు దృష్టిసారించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. బయో మెడికల్ వేస్టేజ్ పై ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులతో కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. బయో మెడికల్ వేస్టేజ్‌పై తరచూ తనిఖీలు చేపట్టి నివేదికలు ఇవ్వాలని కాలుష్య నియంత్రణ మండలి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులతో పాటు ఆర్ఎంపి వైద్యుల నుంచి బయో మెడికల్ వేస్టేజ్‌పై వివరాలు సేకరించాలన్నారు. నగరంలో పెద్దసంఖ్యలో ప్రైవేటు ఆస్పత్రులు ఉన్నా, తగినంత వేస్టేజ్ కలెక్షన్ చూపడం లేదన్నారు. కొందరు వాహనాలకు ఫీజులు చెల్లించాల్సి వస్తుందన్న కారణంతో నాగావళి నదిలో వ్యర్థాలను పారబోస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని చెప్పారు. జిల్లాలోని ప్రైవేటు ప్రాక్టీషనర్లతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వ్యర్థాల వివరాలను డిసిహెచ్ఎస్ ఎన్.కళ్యాణ్‌బాబు వివరించారు. జిల్లాలో వ్యర్థాల సేకరణకు రెయిన్‌బో సంస్థ మాత్రమే ఉందని, క్రమం తప్పకుండా ఆ సంస్థ సేకరించకపోవడం వల్ల వ్యర్థాలను నదిలో పారబోస్తున్నారని మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ సుధీర్ కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ వ్యర్థాల వల్ల నగర ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రతిరోజూ 45 కేజీల వరకు బయో మెడికల్ వేస్టేజ్ మాత్రమే వస్తున్నట్లు రెయిన్‌బో వాహనాలు లెక్కలు చూపుతున్నాయని చెప్పారు. అసలు జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో ఎన్ని పడకలు ఉన్నాయో గుర్తించి తనిఖీలు చేపట్టాలన్నారు. సమావేశంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఇఇ కరుణశ్రీ, జిజిహెచ్ సూపరింటెండెంట్ దాసరి షకీల, ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలు పాల్గొన్నారు.

ఆర్‌టిసి బస్సుల్లో ప్రయాణించాలి

ఎమ్మెల్యే గౌతు శిరీష

జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిరీష

ప్రజాశక్తి- పలాస

ఆర్‌టిసి బస్సుల్లో ప్రజలు ప్రయాణించి అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే గౌతు శిరీష పిలుపునిచ్చారు. పలాస డిపోలో నూతనంగా వచ్చిన నాలుగు బస్సులను సోమవారం ఆమె పచ్చజెండా ఊపి ప్రారంభించారు. అనంతరం డిపో నుంచి కాశీబుగ్గ బస్టాండ్ వరకు, మరలా బస్టాండ్ నుంచి డిపో వరకు కూటమి నాయకులు, ఉద్యోగులు బస్సులో ప్రయాణం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి డిపోలో బస్సులు కొరత, పాత వాహనాలు ఉండడంతో ఇబ్బందులు పడుతున్నట్లు నా దృష్టికి వచ్చిందన్నారు. ఈ విషయాన్ని సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి నూతన బస్సులను మంజూరు చేయించానని తెలిపారు. మూడు బస్సులు ఇచ్ఛాపురం నుంచి విశాఖపట్నం వరకు, మరో బస్సు పలాస నుంచి విశాఖపట్నం త్రీ స్టాఫ్ తిరుగుతాయని చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, డిపో మేనేజర్ సీతారాం నాయుడు, డిపో అసిస్టెంట్ మేనేజర్ రోణంకి సంతోష్‌కుమార్, టిడిపి నాయకులు గాలి కృష్ణారావు, మల్లిపెద్ది నరేంద్ర (చిన్ని), కొరికాన శంకర్, జోగమల్లి, పాండురంగారావు, ఆర్‌టిసి కార్మికుల సంఘం నాయకులు వాలి, దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

మంచు కురిసే వేళలో...

మంచుతో నిండిన కోటబొమ్మాళి-సంతబొమ్మాళి రోడ్డు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

ఉదయం ఎనిమిదిన్నర.. ఏమిటీ ఇంకా వెలుతురు రాలేదు! నిద్రలేచి కళ్లు నలుపుకుంటూ వాకిట్లో అడుగు పెడితే అంతా మంచు మయం. సోమవారం ఉదయం అంతటా పొగమంచు కమ్మేసింది. కోటబొమ్మాళి, కొత్తపేట గ్రామాలతో పాటు పరిసర గ్రామాల్లో రోడ్డెక్కితే ఎదురుగా ఏమొస్తుందో తెలియని విధంగా మంచు దారులను కమ్మేసింది. ఉదయం 5.30 గంటలకు ఒక మోస్తరుగా ప్రారంభమైన మంచు ఏడు గంటల నుంచి క్రమేపీ 8.30 గంటల వరకు పెరిగిపోయింది. ఇళ్లు, పంట పొలాలు, వాహనాలను మంచు ముంచెత్తింది. రోడ్లు మంచుతో నిండిపోవడంతో ఎదురుగా ఎవరొస్తున్నారు.. ఏ వాహనం వస్తోందో తెలియని పరిస్థితుల్లో వాహనచోదకులు లైట్లు వేసుకుని మరీ వెళ్లాల్సి వచ్చింది. క్రమేపీ 9 గంటలకు తగ్గుముఖం పట్టి మంచుతెర తొలగింది. పంట పొలాలతో పాటు గ్రామాల్లో ఇళ్లను, దారులను మంచు కమ్మేయడంతో ఆహ్లాదకర దృశ్యాలు కనువిందు చేశాయి. ఆ మంచు దృశ్యాలు ఇలా ఉన్నాయి.

డయేరియా కలకలం

- పొందూరులో పది మందికి అస్వస్థత
- పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులు

ప్రజాశక్తి - పొందూరు

పొందూరు పట్టణంలోని కస్పావీధిలో డయేరియా ప్రబలింది. సుమారు పది మంది అస్వస్థతకు గురయ్యారు. ఆదివారం రాత్రి వాంతులు, విరోచనాలతో పలువురు బాధపడుతూ ఆస్పత్రుల్లో చేరారు. కస్పావీధికి చెందిన పి.మురళీ, కె.భార్గవి, పి.భారతి శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చేరగా, ఒకే కుటుంబంకు చెందిన చిన్నారులు పి.లక్ష్మీప్రసన్న, పి.భార్గవ్ శ్రీకాకుళంలోని ప్రైవేటు ఆస్పత్రిలో, పి.మహేశ్వరరావు పొందూరు సిహెచ్‌సిలో చికిత్స పొందుతున్నారు. మిగిలిన వారు ఇంటి వద్దే చికిత్స తీసుకుంటున్నారు. డయేరియా ప్రబలినట్లు సోమవారం ఉదయం ప్రచారం కావడంతో వైద్య, పంచాయతీ సిబ్బంది అప్రమత్తమయ్యారు. వీధుల్లో, మురుగు కాలువల్లో, తాగునీటి కుళాయిల వద్ద బ్లీచింగ్ చల్లి పారిశుధ్య పనులు చేపట్టారు. డయేరియా ప్రబలడానికి తాగునీరు కలుషితం కావడమే కారణంగా భావించి తాగునీటి నాణ్యతను పరిశీలించేందుకు నీటి నమూనాలను పరీక్షలకు పంపించారు. డయేరియా ప్రబలిన సమాచారం అందుకున్న జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బాలమురళి గ్రామానికి చేరుకుని పరిసరాలను, తాగునీటి బోర్లు, కాలువలను పరిశీలించారు. గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. అప్రమత్తంగా ఉండాలని వైద్య సిబ్బందికి సూచించారు.

వైద్యాధికారులతో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ

బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే రవికుమార్

ఎమ్మెల్యే రవికుమార్ కస్పావీధిలో బాధితులను సోమవారం పరామర్శించారు. రెండు రోజులుగా వారు తీసుకున్న ఆహారం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్య సిబ్బందితో మాట్లాడుతూ డయేరియా వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట వైద్యాధికారులు సుజాత, రమేష్‌నాయుడు, నవీన్, పవన్ కళ్యాణ్, సర్పంచ్ రేగడి లక్ష్మి, టిడిపి మండల అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహన్, ఇఒ మోహన్‌బాబు తదితరులు ఉన్నారు.

వక్ఫ్ ఆస్తులపై సమగ్ర సర్వే

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం అర్బన్ : జిల్లావ్యాప్తంగా వక్ఫ్ ఆస్తులను గుర్తించేందుకు సమగ్ర సర్వే చేపట్టి సరిహద్దులను నిర్దేశించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో జిల్లా మైనార్టీ అధికారి మెంబర్ కం కన్వీనర్ ఆర్.ఎస్.జాన్ అధ్యక్షతన వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ కమిటీ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వక్ఫ్ ఆస్తులను గుర్తించడానికి సర్వే అండ్ రికార్డు ఎడి, సంబంధిత మండలాల రెవెన్యూ అధికారుల పర్యవేక్షణలో సమగ్ర సర్వే చేపట్టి సరిహద్దులను గుర్తించాలన్నారు. సర్వే సమయంలో వక్ఫ్ ఆస్తులు ఆక్రమణలకు గురైనట్టు గుర్తిస్తే వెంటనే ఆక్రమణ దారులపై పోలీస్‌స్టేషన్లలో ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆదేశించారు. జిల్లా పంచాయతీ అధికారి కె.భారతీసౌజన్య, వక్ఫ్ ఆడిటర్ కం ఇన్‌స్పెక్టర్ అబ్దుల్ సదిక్, రియాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

ఎమ్మెల్యే గొండు శంకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

స్వయం సహాయక సంఘాల మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. స్థానిక మున్సిపల్ మైదానంలో ఈనెల 11వ తేదీ వరకు ఏర్పాటు చేసిన సిక్కోలు డ్వాక్రా బజారును సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు వారి కాళ్లపై నిలబడి ఆర్థికంగా అభివద్ధి చెందాలనే ఉద్దేశంతో మహిళా స్వయం సహాయక సంఘాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విజన్-2047 నాటికి ప్రతి ఇంటికీ ఒక పారిశ్రామికవేత్త ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. సిక్కోలు డ్వాక్రా బజారులో ఈ వారం రోజుల్లో రూ.రెండు కోట్ల వ్యాపారం జరగాలన్నారు. రథసప్తమిలో జిల్లా ఉత్పత్తులను విక్రయాలు చేసేందుకు స్థలం కేటాయిస్తామని చెప్పారు. రానున్న రోజుల్లో మహిళలు లక్షాధికారులు కావాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. మహిళలంతా ప్రభుత్వానికి అండగా ఉండాలని పిలుపునిచ్చారు. జిల్లాలో 45 వేల స్వయం సహాయక సంఘాల గ్రూపుల్లో ఐదు లక్షల మంది మహిళలు ఉన్నట్లు చెప్పారు. సుడా అధ్యక్షులు కొరిగాన రవికుమార్ మాట్లాడుతూ సమాజం అభివృద్ధి చెందాలంటే స్త్రీ శక్తి అభివృద్ధి చెందాలన్నారు. జిల్లాలో తయారవుతున్న ఉత్పత్తులను జిల్లాలోనే కాకుండా ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు, దేశాలకు ఎగుమతి చేసి జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేయాలన్నారు. మహిళలకు కూటమి ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. పలు బ్యాంకుల ఆర్ఎంలు మాట్లాడుతూ మహిళలు రూ.20 లక్షల వరకు రుణాలు పొందవచ్చన్నారు. ఎంఎస్ఎంఇ యూనిట్ ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు. నాబార్డు డిడిఎం కె.రమేష్‌కృష్ణ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు.

డ్వాక్రా ఉత్పత్తులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంకర్

డిఆర్‌డిఎ పీడీ కిరణ్ కుమార్ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివద్ధి చెందాలనే ఉద్దేశంతో డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం స్టాల్స్‌ను సందర్శించారు. కార్యక్రమంలో మెప్మా పీడీ ఎస్.వి రమణ, వంశధార ప్రాజెక్టు కమిటీ చైర్మన్ రవీంద్ర, జిల్లా సమాఖ్య అధ్యక్షులు భానుమతి, పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు, స్వయం సహాయక సంఘాల మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

'మీకోసం'కు 84 వినతులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో నిర్మాణంలో ఉన్న ఆఫ్‌షోర్ సాగునీటి ప్రాజెక్టుకు భూములిచ్చి ఏళ్లు గడుస్తున్నా ప్యాకేజీలు ఇంతవరకు ఇవ్వలేదని, ఆరేళ్లుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా న్యాయం జరగడం లేదని విజయనగరం జిల్లా చీపురుపల్లికి చెందిన రైతులు రామారావు, షన్ముఖరావు, నాగరాజులు కోరారు. జెడ్‌పిలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌లు సోమవారం మీకోసంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ పరిహారం చెల్లించే సమయంలో ప్యాకేజీలు ఇవ్వడానికి సాంకేతికపరమైన ఇబ్బందులు ఉన్న కారణంగా నిలిపివేశారని అన్నారు. ఆధార్, బ్యాంకు ఖాతా సంఖ్య, పట్టాదారు పాసు పుస్తకం, అడంగల్ కాపీల్లో వ్యత్యాసం ఉందని అప్పట్లో చెప్పారని అన్నారు. తర్వాత పలాస ఆర్‌డిఒ కార్యాలయంలో వాటిని సరిచేసుకునేందుకు అవకాశం ఇచ్చారని అన్నారు. వాటిని సరిచేసుకుని ఆరేళ్లు గడుస్తున్నా ప్యాకేజీలు మాత్రం ఇంతవరకు చెల్లించలేదని వివరించారు. తక్షణమే దీనిపై విచారణ చేపట్టి వివరాలు అందజేయాలని సంబంధిత భూసేకరణ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఆమదాలవలస నియోజకవర్గం పరిధిలో రైతులు పండించిన ధాన్యంలో తేమ శాతం అధికంగా ఉందని చూపిస్తూ మిల్లర్లు రైతుల నుంచి అదనంగా ధాన్యం తీసుకుంటున్నారని, దీనివల్ల రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని ఆమదాలవలస వైసిపి నాయకులు చింతాడ రవికుమార్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వివిధ కారణాలతో నిలిపి వేసిన పింఛన్లను తిరిగి పునరుద్ధరించాలని కోరారు. ఉద్దానం ప్రాంతంలో పచ్చని తోటల నడుమ కార్గో ఎయిర్‌పోర్టు నిర్మాణ ప్రయత్నాలు ఆపాలని మందస మండలం గంగువాడ, బిడిమి గ్రామాలకు చెందిన రైతులు వినతిపత్రం అందజేశారు. వంశధార నిర్వాసితుల్లో మిగిలి ఉన్న యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని పాడలికి చెందిన రైతు దామిరి సింహాచలం వినతిపత్రం అందజేశారు. నగరంలోని ఆదివారంపేటకు చెందిన వీడియో గ్రాఫర్ గుణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారని, ఏదైనా ఉపాధి కల్పించాలని మృతుడి భార్య అనిత కోరారు. జిల్లావ్యాప్తంగా 84న వినతులు వచ్చాయి. కార్యక్రమంలో డిఆర్‌ఒ ఎం.వెంకటేశ్వర రావు, జెడ్‌పి సిఇఒ శ్రీధర్ రాజు, డిఆర్‌డిఎ పీడీ కిరణ్‌కుమార్, డిపిఒ కె.భారతీసౌజన్య, జిల్లా ఉద్యాన అధికారి ఆర్.వి.ప్రసాదరావు, జిల్లా బిసి సంక్షేమశాఖ అధికారి అనురాధ, డిఎంహెచ్ఒ డాక్టర్ టి.వి.బాలమురళి, డిసిహెచ్ఎస్ డాక్టర్ కళ్యాణ్‌బాబు, ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ శాంతిశ్రీ, డ్వామా పీడీ బి.సుధాకరరావు పాల్గొన్నారు.

వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

మహారాజశ్రీ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు
పాతపట్నం
OS. 3/2024

Between:- కర్రి కుమారి .....వాది
And:-
కర్రి రాము .....ప్రతివాది

To,
కర్రి రాము, S/o లేటు లక్ష్మీనారాయణ, వయసు 40 సంవత్సరాలు, హిందూ, ఫైనాన్స్ అండ్ రియల్ ఎస్టేట్ వ్యాపారం, కుమ్మరిగుంట గ్రామం, సారవకోట మండలం, శ్రీకాకుళం జిల్లా

పై నెంబరు OS.3/2024 దావాలో గల వాది ప్రతివాదిపై ప్రాంసరీ నోటు దావా దాఖలు చేయగా, సదరు దావా తేదీ **08-01-2025న పై కోర్టులో వాయిదా అయి ఉన్నది.** ఆదినమున ప్రతివాది **పై కోర్టులో ఉదయం 10:30 గంటలకు** శ్రీ కోర్టు వారి ఎదుట స్వయంగా గాని లేదా న్యాయవాది ద్వారా గాని హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలియజేసుకునవలెను. లేనియెడల సదరు దావా OS.3/2024ను మీ పరోక్షమందు విమర్శించి తీర్మానించబడును.

// శ్రీ కోర్టు వారి అనుమతితో //

గేదెల ఫల్గుణరావు
వాది తరుపు న్యాయవాది,
పాతపట్నం.

అక్రమ నిర్మాణాల తొలగింపు

- ఆందోళన వ్యక్తం చేసిన నిర్మాణదారులు
- బాధితులకు ఇళ్ల పట్టాలను మంజూరు చేసిన తహశీల్దార్

ఇంటిని కూల్చవద్దని రోదిస్తున్న వృద్ధురాలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని చిన్న జొన్నవలస వద్ద గల మోదుగుల చెరువు గట్టుపైన ఉన్న అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు సోమవారం తొలగించారు. సర్వే నెంబర్ 108లో ఒకటి, రెండు ఆర్అండ్‌బి స్థలంలోని సర్వే నెంబర్ 14లో మోదుగుల చెరువు గట్టుపై సుమారు 30 సెంట్లు స్థలంలో 21 మంది ఇళ్లు, పశువుల శాలలు, బడ్డీలు నిర్మించుకున్నారు. గతంలో చెరువు గర్భం ఆక్రమణకు గురవుతుందని అదే గ్రామానికి చెందిన రెడ్డి తౌడు హైకోర్టును ఆశ్రయించడంతో ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు ఆక్రమణలు తొలగించడానికి రంగం సిద్ధం చేశారు. తహశీల్దార్ ఎస్.రాంబాబు ఆధ్వర్యంలో డిఎస్‌పి సిహెచ్ వివేకానంద, సిఐ సత్యనారాయణ, ఎస్ఐ బాలరాజు, ఎంపిడిఒ వెంకటరావు తదితర అధికారులంతా అక్కడకు చేరుకొని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. ఇళ్ల నిర్మాణాలను తొలగించే సమయంలో ఆందోళనకారులు ఎటువంటి ఇబ్బంది పెట్టకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో అధికారులకు డిఎస్‌పి దిశా నిర్దేశం చేశారు. అక్రమ నిర్మాణదారులకు అన్ని శాఖల అధికారులు కలిసి సమన్వయంతో వారిని వారించి వేరొక చోట ఇళ్ల పట్టాలను అందించి తొలగింపులు చేపట్టారు. ఆక్రమణలు తొలగిస్తున్న సమయంలో బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తూ ఇళ్లను కూల్చివేస్తే తాము ఎక్కడ నివసించేదని లబోదిబోమంటూ కన్నీరు పెట్టుకున్నారు. దీనిపై 2023 ఆగస్టు నెలలో ఆక్రమణలు తొలగించాలని ఉన్నత న్యాయస్థానం ఆదేశాలు ఇచ్చినప్పటికీ జిల్లా, మండల స్థాయి అధికారులు పెడచెవిన పెట్టడంతో ఫిర్యాదుదారుడు కోర్టుధిక్కరణ నేరం కింద అప్పటి ఐఎఎస్ అధికారులు మనజీర్ జిలానీ, శ్రీ కేష్ బాలాజీ లాఠకర్‌తో పాటు ముగ్గురు ఆర్‌డిఒలు, నలుగురు తహశీల్దార్లుపైన హైకోర్టును ఆశ్రయించాడు. ఈనెల 20 తేదీలోపు ఆక్రమణలు తొలగించాలని లేనియెడల అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు ఆదేశాలు వెలువరించడంతో రెవెన్యూ అధికారులు ఆక్రమణలు తొలగించారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బి డిఇ గణపతి, సర్వేయర్ బొడ్డేపల్లి గోపి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పప్పల గోవింద రావు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జెసిబితో తొలగిస్తున్న ఆక్రమణలు

సామగ్రిని ఇంటి నుంచి రహదారి పైకి తరలిస్తున్న బాధితులు

వినతిపత్రం అందజేస్తున్న షణ్ముఖరావు

సంక్రాంతి వరకు అవకాశం కల్పించాలి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

ఫుట్‌పాత్ వ్యాపారులకు సంక్రాంతి వరకు అవకాశం కల్పించాలని సిపిఎం నాయకులు నంబూరి షణ్ముఖరావు అన్నారు. ఈ మేరకు ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తిని సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టెక్కలి పట్టణంలో ఫుట్‌పాత్ పక్కన పళ్లు, కాయగూరలు అమ్ముకొని జీవించే వారికి చిన్నబజారులో ఓ స్థలం చూపించి పంపించారని అన్నారు. చిన్నబజారు వెళ్లే మార్గం కాలువలు సక్రమంగా లేకపోవడంతో దుర్గంధంగా తయారైందన్నారు. చుట్టుపక్కల కాయకూరలు, చేపల మార్కెట్లు ఉండడంతో ట్రాఫిక్ జామ్ అవుతుందన్నారు. సంక్రాంతి ముందు చిరు వ్యాపారులకు బతుకు తెరువు లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. సంక్రాంతి ముందు టెక్కలిలో భారీ వాహనాలు రాకుండా చూడాలని, చిరు వ్యాపారుల వల్ల ఎటువంటి ట్రాఫిక్ అంతరాయాలు ఉండవని డిఎస్‌పికి, సిఐ కార్యాలయాలకు వినతిపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కొల్లి ఎల్లయ్య, తోపుడు బళ్ల సంక్షేమం సంఘ నాయకులు ఉర్జాన మాధవరావు, ఎర్ర చిన్నమ్మడు, ఎల్.తిరుపతిరావు, కాయి నాగు, ఎల్.వరదరాజులు, గోరు మిన్నారావు, కె.ఉపేంద్ర, సిహెచ్.సింహాలచం, పి.శ్రీనివాసరావు, దేవాది రజని, పిడుగు రాము పాల్గొన్నారు.

వీడియో కాల్ ద్వారా సంబంధిత అధికారులతో మాట్లాడుతున్న డిఎస్‌పి

ఫిర్యాదులు పరిష్కరించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం

జిల్లా ఎస్‌పి కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కార కార్యక్రమంలో 42 ఫిర్యాదులు అందాయి. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు పట్టణ డిఎస్‌పి సిహెచ్ వివేకానంద ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక కార్యక్రమంలో వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్జీదారులు అందించిన ఫిర్యాదులు చట్ట పరిధిలో పరిష్కరించాలని పోలీసు అధికారులను సూచించారు. ఫిర్యాదుదారులతో మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యలను తెలుసుకొని పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. ఫిర్యాదు దారుల అర్జీలు, వారి వివరాలు పోలీసు అధికారులకు ఫోన్ ద్వారా తెలియజేసి చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ఆయా ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను నిర్ణీత సమయంలో జిల్లా పోలీస్ కార్యాలయానికి నివేదిక రూపంలో పంపించాలన్నారు.

నేడు జాబ్‌మేళా

టెక్కలి : టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో మంగళవారం నిరుద్యోగులకు ఉపాధి కల్పన దృష్ట్యా జాబ్‌మేళా నిర్వహించనున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి ఆధ్వర్యాన నిర్వహించే ఈ జాబ్‌మేళాకు డిగ్రీ, ఇంటర్ ఉత్తీర్ణత సాధించిన నిరుద్యోగ అభ్యర్థులు హాజరుకావాలని కోరారు. 18 నుంచి నుంచి 45 ఏళ్ల వరకు వయసు గల వారు అర్హులని అన్నారు. ఈ జాబ్‌మేళాలో రెండు బహుళ జాతి కంపెనీలు పాల్గొంటాయని చెప్పారు. ఆసక్తి గల నిరుద్యోగులు తమ ఆధార్ కార్డులు, బయోడేటా ఫారం, పాస్‌పోర్టు సైజ్‌ఫొటోలు తీసుకుని హాజరు కావాలన్నారు. ఈ ఆవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ

నరసన్నపేట : శ్రీకాకుళం చిన్మయ యువకేంద్ర ఆధ్వర్యాన స్థానిక ఎల్‌విఆర్ డిగ్రీ కళాశాలలో సోమవారం వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ ఇచ్చారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.ప్రసాదరావు మాట్లాడుతూ వ్యక్తిత్వ వికాస శిక్షణ తరగతులు నిర్వహించడం విద్యార్థులకు ఎంతో అవసరమని అన్నారు. అవి విద్యార్థుల మూర్తిమత్వాన్ని పెంపొందించడానికి దోహదపడుతుందని అన్నారు. కళాశాల ఎకడెమిక్ డైరెక్టర్ జి.వి.జగన్నాథరావు మాట్లాడుతూ ఇటువంటి శిక్షణా తరగతులు నెలకొకసారి నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు డి.కోటేశ్వరరావు, ఎన్.ప్రభాకరరావు, ఎన్.ఆనందరావు, ఎన్.రాము పాల్గొన్నారు.

నూతన పుస్తకావిష్కరణ

టెక్కలి రూరల్: టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాల సిఎస్ఇ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా విధులు నిర్వహిస్తున్న గంటి విజయ్‌కుమార్, మొదలవలస దివ్యలు 'డేటా వేర్ హౌసింగ్ అండ్ డేటా మైనింగ్' అనే పుస్తకాన్ని రచించారు. ఈ పుస్తకాన్ని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు సోమవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. సిఎస్ఇ, ఐటి, సిఎస్ఎం, ఇసిఇ విద్యార్థులకు ఈ పుస్తకం చాలా ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. విద్యార్థులకు, సమాజానికి ఉపయోగపడే మరిన్నిపుస్తకాలను రచించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డీన్ ఆరెడ్డీ డాక్టర్ డి.శ్రీరాములు, సిఎస్ఇ హెచ్‌డి డాక్టర్ వై.రమేష్ పాల్గొన్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాగేశ్వరరావు

భోజన నాణ్యతలో రాజీ పడొద్దు

ఎమ్మెల్యే గోవిందరావు

ప్రజాశక్తి- హిరమండలం

ఆహారం నాణ్యతలో ఎట్టి పరిస్థితుల్లో రాజీపడవద్దని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. హిరమండలం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని సోమవారం ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలని, సమానత్వం విద్యార్థి దశ నుంచే ప్రారంభం కావాలని అన్నారు. విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని అధికారులకు సూచించారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

కొత్తూరు : మండలంలోని కొత్తూరు, నివగాం ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఎమ్మెల్యే ఎం.గోవిందరావు ప్రారంభించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మాతల గాంధీ, అగతముడి అరుణకుమార్, మాధవరావు, దాసునాయుడు, కె.శ్రీనివాసరావు, చక్రధర్, డి.శ్రీను, టి.తిరుపతిరావు, ప్రిన్సిపాల్ బండారు రవికుమార్, ప్రధానోపాధ్యాయులు ఎ.గోవిందరావు పాల్గొన్నారు.

విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

డబుల్ వీల్ మార్కర్ యంత్రంతో ఉపయోగం

రైతులకు అవగాహన కల్పిస్తున్న సంస్థ ప్రతినిధులు

ప్రజాశక్తి- రణస్థలం

వరి మాగాణిల్లో నేరుగా మొక్కజొన్న సాగు చేసే రైతులకు వరుసల మధ్య, విత్తనాల మధ్య సమాన దూరంలో విత్తుకోవడానికి డబుల్‌వీల్ మార్కర్ యంత్రం చాలా ఉపయోగకరంగా ఉందని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ డిప్యూటీ మేనేజర్ ఆర్.హరిబాబు అన్నారు. సోమవారం మండలంలోని కోష్టలో తమ సంస్థ ఆధ్వర్యంలో పునరుత్పాదక వ్యవసాయ విధానాలను రైతులకు అందించే కార్యక్రమంలో భాగంగా వరికోతల అనంతరం నేరుగా మొక్కజొన్న సాగు చేసేందుకు అనువైన 250 డబుల్‌వీల్ మార్కర్ యంత్రాలను పరిసర మండలాల లీడ్ ఫార్మర్స్‌కు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పదేళ్లుగా జిల్లా రైతులకు సులభమైన యాంత్రీకరణ విధానాలపై ఎప్పటికప్పుడు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడమే కాకుండా అవసరమైన యంత్ర పరికరాలను రైతులకు అందిస్తూ రైతుల జీవనోపాధుల కల్పనకు ఎంతగానో కృషి చేస్తున్నామని గుర్తు చేశారు. దున్నకుండా మొక్కజొన్న సాగు చేపట్టడం వలన అదనపు సాగు ఖర్చులు, సుమారు 2,3 నీటి తడులు ఆదాచేయవచ్చని ఏరియా మేనేజర్ పి.తవిటినాయుడు అన్నారు. గ్రామస్థాయిలో లీడ్ ఫార్మర్స్ వద్ద డబుల్ వీల్ మార్కర్స్ అందుబాటులో ఉంచామని, వాటిని రైతుల పరస్పర సహకారంతో సక్రమంగా వినియోగించుకుంటూ మొక్కజొన్న సాగు విస్తీర్ణం పెంచేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సమీప మండల పరిధిలో లీడ్ ఫార్మర్స్, సంస్థ సమన్వయ కర్తలు జె.గోపాల్, కె.ఎర్నాయుడు, ఎస్.అప్పల సూర్యనారాయణ, ఎం.సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్‌పి వివేకానంద

పోక్సో కేసు నిందితుడు అరెస్టు

డిఎస్‌పి సిహెచ్.వివేకానంద

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని గేటు ప్రాంతంలోని రెల్లివీధికి చెందిన మైనర్ బాలికపై అదే వీధికి చెందిన కోటిపల్లి రాజు ప్రేమ పేరుతో లోబరుచుకుని అత్యాచారం చేయడంతో మైనర్ బాలిక గర్భవతి అయినట్లు ఆమె తల్లిదండ్రులు గుర్తించి ఆదివారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కోటిపల్లి రాజును అదుపులోకి తీసుకొని పోక్సో కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డిఎస్‌పి సిహెచ్ వివేకానంద తెలిపారు. సోమవారం పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో నిందితుడిని హాజరుపర్చారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ రాజు నూడిల్స్ షాపులో పని చేస్తున్నాడని, మైనర్ బాలిక ఇంటికి ఎదురు ఇంటిలోనే ఉంటున్నాడని, గడచిన సంవత్సర కాలంగా పరిచయం ఉందని తెలిపారు. కొన్ని పత్రికలు, చానళ్లలో నిందితుడు టిడిపికి చెందిన వాడని కథనాలు వచ్చాయని పోలీసుల విచారణలో అది అవాస్తవమని తేలిందన్నారు. అలాగే కూల్ డ్రింక్‌లో మత్తు మందు కలిపి అత్యాచారం జరిపినట్లు వచ్చిన కథనాలు కూడా తప్పు అని తెలిపారు. నిందితుడు మైనర్ బాలికను ప్రేమపేరుతో వంచించి ఆమె ఇష్టం లేకుండా అత్యాచారం జరిపాడని అది చట్టరీత్యా నేరమన్నారు. మైనర్ బాలికలపై అఘాయిత్యాలకు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. పోక్సో చట్టం చాలా కఠినతరమైన చట్టమని, ఈ కేసులోని నిందితులకు కఠినమైన శిక్షలు తప్పవని హెచ్చరించారు. బాధితురాలికి ప్రభుత్వం నుంచి రావాల్సిన ఆర్థికసాయం కోసం స్త్రీ శిశుసంక్షేమశాఖ అధికారులకు లేఖ రాయడం జరిగిందని తెలిపారు. సమావేశంలో సిఐ పాండ్రంకి సత్యన్నారాయణ, ఎస్ఐ సనపల బాలరాజు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సైనిక లాంఛనాలతో నిర్వహిస్తున్న అంత్యక్రియలు

గుండెపోటుతో సిఆర్‌పిఎఫ్ జవాను మృతి

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని తోలాపికి చెందిన సిఆర్‌పిఎఫ్ జవాన్ బొనిగి రమణారావు (54) సోమవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. ఉదయం బాత్‌రూంలో స్నానానికి వెళ్లిన రమణారావుకు గుండెపోటు రావడంతో ఒక్కసారిగా కుప్పకూలిపోగా, గమనించిన కుటుంబసభ్యులు హుటాహుటిన శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈయన ప్రస్తుతం చత్తీస్‌ఘడ్‌లో సిఆర్‌పిఎఫ్ జవాన్‌గా పనిచేస్తూ మూడు రోజుల క్రితమే సెలవుపై వచ్చారు. దీంతో 198 బెటాలియన్ ఎస్ఐ తిరుమలరావు ఆధ్వర్యంలో సైనిక లాంచనాలతో అంత్యక్రియలను నిర్వహించారు. మృతునికి భార్య జ్యోతి, ఇద్దరు కుమారులు అమ్మన్నాయుడు, సందీప్ ఉన్నారు. ఈ అంత్యక్రియలకు పారామిలటరీ అసోసియేషన్ సభ్యులు వై.ఎ.నాయుడుతో పాటు పలువురు మాజీ సైనికులు, గ్రామస్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

న్యాయ పోరాటం చేస్తా

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

పత్రాలను చూపిస్తున్న ప్రేమ్‌కుమార్

మండలం లోని ఈదుపురానికి చెందిన కీర్తిశేషులు నర్తు శ్రీరాములు కుంటుంబానికి చెందిన పదెకరాల భూమి పలాస మండలం రామకృష్ణాపురం వద్ద 1966లో కొనుగులు చేసిన భూమి ఆక్రమించు కుంటున్నారని, దీనిపై న్యాయ పోరాటం చేస్తానని ఆయన వారులు నర్తు ప్రేమ్‌కుమార్ స్పష్టం చేశారు. ఈ మేరకు విలేకరులతో సోమవారం మాట్లాడారు. రామకృష్ణాపురంలోని భూమి వివాదం న్యాయ స్థానంలో యాథాస్థితి ఉండాలని ఉత్తర్వులు ఉన్నా... కుత్తమ లక్ష్మణకుమార్ దౌర్జన్యంగా భూమిలో ప్రవేశించి బోర్డులు తొలగిస్తున్నారని అన్నారు. ఇదే వ్యక్తి గతంలోనూ దౌర్జన్యం చేస్తే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని అన్నారు. మరోసారి ఈ నెల 5న మళ్లీ కోర్టు పరిధిలోని భూమిలో అక్రమంగా ప్రవేశించి ప్రొక్లైయినర్‌తో మట్టి తొలగిస్తున్నారని తెలిపారు. మళ్లీ పోలీసులకు ఫిర్యాదు చేశానని అన్నారు. అధికార పార్టీ అందండలతో దౌర్జన్యం చేస్తే చూస్తూ ఊరుకోమని స్పష్టం చేశారు. పోలీసులు, ఉన్నత అధికారులు చొరవ తీసుకుకోవాలని కోరారు.

మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయం

కమ్యూనిటీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెలే శంకర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. మండలంలోని వమరవల్లి పంచాయతీ గొర్రెలవానిపేటలో సోమవారం కమ్యూనిటీ భవనం, రోడ్లకు ఎమ్మెల్యే శంకర్ ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసిపి హయాంలో గ్రామాల్లో కనీస సౌకర్యాలు కూడా కల్పించకపోవడంతో గ్రామాల్లో రోడ్లు, కాలువలు శిథిలావస్థకు చేరిపోయాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలకు అభివృద్ధి, సంక్షేమం సమాంతరంగా అందిస్తున్నట్లు చెప్పారు. ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని, నియోజకవర్గంలో అన్నివిధాల అభివృద్ధి చేయడం లక్ష్యమని పేర్కొన్నారు. ఇటీవల గ్రామాల్లో నిర్వహించిన పల్లెపండుగ, ప్రజా దర్బారు కార్యక్రమాల్లో ప్రజల నుంచి రోడ్లు, కాలువలు కావాలని వినతులు ఎక్కువగా అందాయన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో గార మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐదేళ్లుగా పూర్తి కాని సచివాలయ భవనం

ప్రజాశక్తి- లావేరు

మండల కేంద్రం లావేరు సచివాలయం-2 లావేటిపాలెంలో పక్కాభవనం లేక ప్రజలు, ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో రూ.35 లక్షల నిధులు మంజూరు చేయగా అప్పటి ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ప్రారంభించారు. ఐదేళ్లుదాటుతున్నా భవన నిర్మాణం మాత్రం పునాదుల వరకు వచ్చి అక్కడితో పనులు నిలిచిపోయాయి. అప్పట్లో ప్రభుత్వం భవన నిర్మాణానికి సిమెంట్, ఇనుము మెటీరియల్‌ను గుత్తేదారుకు సరఫరా చేసింది. గుత్తేదారు 2019లోనే పునాదుల వరకు పనులు చేసి అక్కడితో పనులు నిలుపుదల చేశారు. ఇప్పటికీ నిర్మాణ పనులు మొదలు పెట్టకపోవడంతో పిల్లర్లు ఇనుము తుప్పుపట్టి పనికి రాకుండా పోతుంది. మరోవైపు సొంత భవనం లేక సచివాలయానికి వచ్చే ప్రజలు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం సచివాలయం అద్దె భవనంలో నడుస్తోంది. ఇటీవల ఆ భవనం యజమాని ఓ ప్రైవేట్ బ్యాంకు దగ్గర ఋణం తీసుకుని అప్పుతీర్చక పోవడంతో సంబంధిత బ్యాంక్ అధికారులు ఇటీవల సచివాలయానికి వచ్చి భవనాన్ని ఖాళీ చేయాలని చెప్పారు. సొంత భవనం నిర్మాణం పూర్తికాక మరోవైపు అద్దె భవనాన్ని ఖాళీ చేయాలని బ్యాంక్ అధికారులు ఒత్తిడి చేయడంతో ఎటూపోలేక ఉండలేక నానా అవస్థలు పడుతున్నారు. ఇక్కడి పరిస్థితిపై గ్రామస్తులు కొంతమంది కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ ఇప్పటికీ నిర్మాణ పనుల్లో కదిలికలేదు. జిల్లా అధికారులు స్పందించి భవన నిర్మాణ పనులు త్వరితగతిన ప్రారంభించి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, సిబ్బంది కోరుతున్నారు.

నిర్మాణానికి వేసిన శిలాఫలకం

సచివాలయ భవనానికి వేసిన పునాదులు

విద్యార్థులకు అభినందనలు

వజ్రపుకొత్తూరు: మండలంలోని గోవిందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి ప్రతిభా పరీక్షకు అర్హత సాధించారని ప్రధానోపాధ్యాయులు కె.హరిబాబు తెలిపారు. ఈ మేరకు విద్యార్థులను, గైడ్ టీచర్ ఉమారావును సోమవారం అభినందించారు. విద్యార్థులు ఎడ్యుకేషనల్ ఎఫిషియన్సీ మెరిట్ టెస్టులో ప్రిలిమ్స్ ఉత్తీర్ణులై రాష్ట్రస్థాయి మెయిన్స్ పరీక్షకు అర్హత సాధించారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల మేధాశక్తిని వెలికితీసేందుకు, వారిని ఆర్థికంగా ప్రోత్సహించేందుకు ఎడ్యుకేషనల్ ఎపిఫనీ స్వచ్ఛంద సంస్థ 7 నుంచి పదో తరగతి విద్యార్థులకు ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహించారని అన్నారు. ఈ పరీక్షను ప్రిలిమ్స్, మెయిన్స్ రెండు స్థాయిల్లో నిర్వహించి రాష్ట్ర, జిల్లా, మండలస్థాయిల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, నగదు పురస్కారాలు అందిస్తారని తెలిపారు. 7వ తరగతి చదువుతున్న పట్టపగలు ప్రణీత్, డొక్కరి ప్రత్యూష, సాన ప్రియ మెయిన్స్‌కు అర్హత సాధించారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మణరావు, చింత ఉమారావు, సీతమ్మ, సత్యరాజు, రషీద్, ఉమామహేశ్వరి, నాగరాజు, రాజశేఖర్, ధర్మారావు, పార్థసారథి పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం హరిబాబు

జీడి కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- పలాస

జీడి పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని జీడి కార్మికుల లేబర్ అసోసియేషన్ అధ్యక్షులు శిష్టు గోపి డిమాండ్ చేశారు. ఈ మేరకు తహశీల్దార్ కళ్యాణ చక్రవర్తిని సోమవారం కలిసి వివిధ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీడి కార్మికులకు కార్మిక చట్టాలు అమలు కావడం లేదన్నారు. ఇఎస్ఐ, పిఎఫ్, గ్రాడ్యూటీ అమలయ్యే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. పరిశ్రమల్లో కార్మికులకు కనీసం మౌలిక సదుపాయాలు యాజమాన్యం కల్పించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, అధికారులు జీడి కార్మికుల సమస్యలపై దృష్టి సారించి సమస్యలు పరిష్కారం చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. వినతిపత్రం అందజేస్తున్న వారిలో ప్రధాన కార్యదర్శి అంబటి ఆనందరావు, బమ్మిడి సంతోష్‌కుమార్, గజ్జి బాలయ్య, పి.ప్రకాష్ పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న గోపి

జాతీయస్థాయి పోటీలకు డొంకూరు విద్యార్థులు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ అథ్లెటిక్స్, ఖోఖో పోటీలకు డొంకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు జె.సరోజని సోమవారం తెలిపారు. గతనెల ఏలూరు జిల్లాలో నిర్వహించిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అథ్లెటిక్స్ పోటీల్లో అండర్-14 షార్ట్‌పుట్ బాలురు విభాగంలో బి.భరత్ చంద్ర 12.45 మీటర్లు వేసి రజిత పథకం సాధించారని అన్నారు. పల్నాడు జిల్లా వేదికగా బాలికల అండర్-14 ఖోఖో రాష్ట్రస్థాయిలో రజిత ప్రతిభ కనబరిచి పతకాలు సాధించి జాతీయ స్థాయికి ఎంపికయ్యారని అన్నారు. డి.మీన మహారాష్ట్రలో కొల్హాపూరు వేదికగా ఈ నెల పది నుంచి 14 వరకు నిర్వహించనున్న జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. బి.భారత్‌చంద్ర జార్ఖండ్ రాష్ట్రం రాంచి వేదికగా ఈ నెల 11 నుంచి 15 వరకు నిర్వహించనున్న జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు పాల్గొనేందుకు సిద్ధమయ్యారని అన్నారు. వీరి ఎంపికపై పాఠశాల స్కూల్ విద్యా కమిటీ చైర్మన్ కె.జానకిరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

అభినందిస్తున్న హెచ్ఎం సరోజని

ఉత్సాహంగా చిన్నారుల చెస్ టోర్నీ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఆలోచనా శక్తిని పెంచుకునేందుకు చెస్ క్రీడ ఎంతగానో దోహదపడుతుందని, చిన్నారుల్లో ఉత్సాహం పెరుగుతుందని జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షులు హరికాప్రసాద్ అన్నారు. నగరంలోని ఇలిసిపురంలో స్కూల్ ఆఫ్ చెస్ ఆకాడమీ ఆధ్వర్యాన సోమవారం జిల్లాస్థాయి చెస్‌టోర్నీ నిర్వహించారు. వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా ఆరు రౌండ్ల పాటు చెస్ పోటీల్లో పాల్గొన్నారు. ఉత్కంఠగా సాగిన ఈ టోర్నీలో 5.5 విజయాలతో టోర్నీ విజేతగా మంగరాజు శేషాద్రి పట్నాయక్ సత్తాచాటారు. రన్నరప్‌గా బలివాడ జయంత్ 2వ స్థానం సాధించాడు. ఉరిటి లిఖిత్ శ్రీహర్ష, గెల్లంకి ఆశ్రితరాం, కొమర యోగేష్, నమ్మి జష్వంత్, ప్రేమ్ సాయి, తురకాల తనిష్, దివ్యేష్, పేర్ల హర్షిత్, కాకిన ఈశ్వర్సాయి, మల్లారెడ్డి త్రిలోచన, రాకోటి శరణ్య, తంగుడు సౌర్య, కరణం పార్ధవి, పాతిన హేమంత్, దిలీప్ కుమార్, అక్షిత రెయ్య, పాతిన జ్యోతిప్రకాష్, వాడిపల్లి శాంతిస్వరూప్, నిమ్మక ప్రసన్నకుమార్, కింజరాపు విజయదర్శిత్, కొల్లా కరుణ్మయి, భవిశెట్టి కార్తికేయ విజేతలుగా నిలిచారు. అండర్-7లో విజేతలగా కరణం రోహన్, కల్లేపల్లి నీల్‌రాం మాన్విత్, బరాటం పూర్ణిత, చింతాడ రోషన్, చింతాడ రియాన్ సౌర్య, సవలాపురపు యశ్వంత్ సాయి విజయాన్ని సొంతం చేసుకున్నారు. అనంతరం హరికాప్రసాద్ చేతులమీదుగా బహుమతులను అందజేశారు.

విజేతలకు బహుమతులు అందజేస్తున్న హరికాప్రసాద్

సిసి రోడ్డును పరిశీలిస్తున్న ఎఇ శ్రీవల్లి తదితరులు

రోడ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలి

ప్రజాశక్తి- లావేరు

సిసి రోడ్ల నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని పంచాయతీరాజ్ ఎఇ శ్రీవల్లి సచివాలయ అధికారులను ఆదేశించారు. సోమవారం మండలంలోని తాళ్లవలస పంచాయతీలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ఉపాధిహామీ నిధుల కింద తాళ్లవలస సచివాలయ పరిధిలో సుమారు రూ.10 లక్షలతో ఇటీవల నిర్మించిన సిసి రోడ్లును ఆమె పరిశీలించి కొలతలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోడ్ల నిర్మాణంలో నాణ్యతను క్వాలిటీ కంట్రోల్ అధికారులు కచ్చితంగా పరిశీలన చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న సిసి రోడ్ల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ముప్పిడి మురళీ మోహన్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులతో భూ సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి- పొందూరు

రాష్ట్రంలో భూసమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు ఎంతగానో దోహద పడుతున్నాయని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. మండలం దల్లిపేటలో సోమవారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం చేపట్టిన భూ రీసర్వే కారణంగా రాష్ట్రంలో భూసమస్యలు పెరిగి పోయాయన్నారు. రాష్ట్రంలో నెలకొన్న భూసమస్యలను పరిష్కరించేందుకు ఈ రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. అనంతరం పలువురు తన దృష్టికి తీసుకువచ్చిన భూసమస్యలను అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించారు. కార్యక్రమంలో తహశీల్దార్ వెంకటేష్

పొందూరు : మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

రామానుజులు, సర్పంచ్ కంబాపు నీలవేణి, టిడిపి మండల అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహన్, మాజీ సర్పంచ్ బి.రఘురామరెడ్డి, జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బలగ శంకర భాస్కరరావు, సర్వేయర్ వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : రెవెన్యూ సదస్సులతో రైతులకు మేలు చేకూరేవిధంగా చర్యలు తీసుకోవాలని సర్పంచ్ ప్రతినిధి హనుమంతు వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని తలగాంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో రీ సర్వే డిటి జె.వనిత పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మండలంలోని కేశుపురం పంచాయతీలో భూముల సరిహద్దులను గుర్తించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. ఈ మేరకు తహశీల్దార్ వెంకటరావు నిర్వహించిన రెవెన్యూ సదస్సులో దరఖాస్తులను అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి డి.ఢిల్లీరావు, డి.కామేశ్వరరావు, గ్రామ సర్వేయర్ డి.గోపి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రవికుమార్

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి సహకారం

శ్రీకాకుళం అర్బన్: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలు పరిష్కరించేందుకు పూర్తి సహకారాన్ని అందిస్తానని జిల్లా ఖజానా శాఖ డిడి సి.రవికుమార్ తెలిపారు. సోమవారం నగరంలోని ఎపి ఎన్‌జిఒ హోంలో రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న పెన్షనర్లకు లైఫ్ సర్టిఫికెట్లు జారీ చేయడంలో సంఘం అందిస్తున్న సహకారాన్ని ఆయన అభినందించారు. 165 మంది పెన్షనర్లకు లైఫ్ సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం రిటైర్డు ఉద్యోగుల సంఘం వార్షిక డైరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రకాశరావు, జిల్లా అధ్యక్షులు కె.సోమ సుందరరావు, నగర గౌరవాధ్యక్షులు బలరామ కృష్ణారావు, ప్రధాన కార్యదర్శి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

సైక్లింగ్‌పై అవగాహన కల్పిస్తున్న సీజు

ఆరోగ్య పరిరక్షణకు సైక్లింగ్ దోహదం

శ్రీకాకుళం అర్బన్: సైకిల్ తొక్కడం వల్ల ఆరోగ్య పరిరక్షణ సాధ్యమౌతుందని సైక్లిస్ట్ కాపవరపు సీజు అన్నారు. సోమవారం ఏడురోడ్ల కూడలి వద్ద సైక్లింగ్‌పై యువతకు అవగహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైక్లింగ్ వల్ల శారీరక శ్రమ పెరిగి కండరాల్లో సమస్యలు ఉత్పన్నం కాకుండా ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. ప్రస్తుత కాలంలో ప్రతిఒక్కరూ వృత్తిరీత్యా, చదువుల కారణంగా చాలామంది వ్యాయామానికి దూరమవు తున్నారని, శారీరక శ్రమ తక్కువ కావడం వల్ల చిన్నవయసులోనే అధిక బరువు, ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నారన్నారు. వ్యాయామం చేయడానికి అవకాశం లేని వారికి సైక్లింగ్ ఎంతో మేలన్నారు. ఉద్యోగులు కార్యాలయాలకు వెళ్లే సమయంలో, షాపింగ్‌కు వెళ్లేప్పుడు సైకిల్ వినియోగిస్తే, ఎన్నో ప్రయోజనాలు సమకూరుతాయన్నారు. బరువు తగ్గాలనుకునే వారు వ్యాయామం ద్వారా వారానికి కనీసం 2 వేల కేలరీలు ఖర్చు చేయాల్సి ఉంటుందని, ప్రతిరోజూ అరగంట సైకిల్ తొక్కితే ఏడాదిలో శరీరంలోని వివిధ భాగాల నుంచి దాదాపు ఐదు కిలోల కొవ్వును కరిగిస్తుందన్నారు. గుండె కండరాలను, రెస్టింగ్ పల్స్, రక్తంలో కొవ్వు స్థాయిలను తగ్గిస్తుందన్నారు. అందువల్ల ప్రతిఒక్కరూ సైక్లింగ్‌ను అలవర్చు కోవాలన్నారు. ప్రతి ఆదివారం శ్రీకాకుళం సైక్లింగ్ క్లబ్ ఆధ్వర్యాన సైక్లింగ్ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో లైన్స్‌క్లబ్ సెంట్రల్ మెంటర్ నటుకుల మోహన్, జామి మణి, కరణం శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర దిశగా చంద్రబాబు పాలన

ఆమదాలవలస: రాష్ట్రంలో స్వర్ణాంధ్ర దిశగా సిఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పాలన కొనసాగిస్తుందని తెలుగుశక్తి అధ్యక్షుడు బి.వి. రామ్ అన్నారు. సోమవారం టిడిపి కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడారు. ప్రజల అకాంక్షలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని, ఎన్నికల హామీ లో భాగంగా అన్ని పింఛన్లు పెంపు, అన్న క్యాంటీన్లను అందుబాటులోకి తెచ్చింద న్నారు. గత దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలండర్ల పంపిణీ కూడా ప్రారంభించిందన్నారు. తాజాగా కళాశాల విద్యార్థులకు కూడా భోజన పథకం ప్రారంభమైందన్నారు.

మాట్లాడుతున్న రామ్

న్యాయవాదులు విధుల బహిష్కరణ

పాతపట్నం : అనంతపురం జిల్లాలో న్యాయ వాది శేషాద్రిరావు మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని బార్ అసోసియేషన్ అధ్యక్షులు బి.ఇ. సత్యనారా యణ అన్నారు. ఈ మేరకు సోమవారం విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు గోవిందరావు, రవికుమార్, సుందరరావు, అప్పలనాయుడు, రమణ, దాలయ్య, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు

మద్యం సీసాలు స్వాధీనం

పలాస : పలాస ఇంద్ర చౌక్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా 64 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు కాశీబుగ్గ పోలీసులు తెలిపారు. వజ్రపుకొత్తూరు మండలానికి చెందిన కర్ని అభిలాష్, నందిగాం మండలానికి చెందిన అంబలి రాగూర్ బైక్‌లపై అక్రమంగా మద్యం తరలిస్తున్నారని అన్నారు. వాటిని స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్టు చేశామన్నారు.

ఎరుకుల సేవాసంఘం ఉత్తరాంధ్ర

వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సూర్యారావు

ప్రజాశక్తి- పొందూరు

ఆంధ్రప్రదేశ్ ఎరుకుల సేవాసంఘం ఉత్తరాంధ్ర జిల్లాల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మండల కేంద్రంలోని ఎరుకుల కాలనీకి చెందిన గొర్లె సూర్యా రావును నియమించారు. విశాఖపట్నంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.శ్రీనివాసరావు, ఉత్తరాంధ్ర జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.రమణమూర్తి, దాసరి నారాయణమ్మల ఆధ్వర్యంలో జరిగిన కమిటీ ఎన్నికల్లో సూర్యారావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తన నియామకంపై కమిటీ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

సూర్యారావు

స్రవంతిని అభినందిస్తున్న రామ్మోహన్ నాయుడు

'జాయ్‌కిడ్స్'కు గ్లోబల్ ఎక్స్‌లెన్స్ అవార్డు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని పిఎన్‌కాలనీలో ఉన్న జాయ్‌కిడ్స్ స్కూల్‌కు అరుదైన గౌరవం దక్కింది. ఆహ్లాదకరమైన వాతావరణంలో నాణ్యమైన, విలువలతో కూడిన విద్యను అందిస్తున్న స్కూళ్ల జాబితాలో చోటుదక్కించుకుంది. అందులో భాగంగా జాతీయస్థాయి 'గ్లోబల్ ఎక్స్‌లెన్స్ అవార్డు' లభించింది. భారతీయ హ్యూమన్ రైట్ కౌన్సిల్ ఈ అవార్డును స్కూల్ కరస్పాండెంట్ జామి స్రవంతికి ఢిల్లీలో అందజేశారు. ఈ సందర్భంగా ఆమెకు కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అభినందించారు.

ప్రగడపుట్టుగలో పారిశుధ్య పనులు

కవిటి: పారిశుధ్య నిర్వహణ పక్కాగా చేపట్టి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని కవిటి సర్పంచ్ పూడి లక్ష్మణరావు అన్నారు. మండలంలోని ప్రగడపుట్టుగలో సోమవారం పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. గ్రామంలో చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు పంపించారు. కార్యక్రమంలో ఇఒ వీరభద్రస్వామి పాల్గొన్నారు.

పనులను పరిశీలిస్తున్న ఇఒ వీరభద్రస్వామి

పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలి

ప్రజాశక్తి- లావేరు

పాఠశాల అభివృద్ధికి ఎస్ఎంసి కమిటీ పూర్వ విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి కృషి చేయాలని ఎచ్చెర్ల ఎఎంసి మాజీ చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర అన్నారు. సోమవారం మండల కేంద్రంలో జెడ్‌పి పాఠశాల చైర్మన్ లంకలపల్లి రాంబాబు అధ్యక్షతన ఎస్ఎంసి కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తోటయ్యదొర మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల హాజరు శాతం పెంపు, ఉత్తమ ఫలితాలు సాధించే లక్ష్యం, వనరులు సద్వినియోగం చేసుకోవడంపై దృష్టి సారించాలన్నారు. పాఠశాలకు ప్రహరీగోడ నిర్మాణానికి నిధులు మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాలన్నారు. హెచ్ఎం తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్ఎం పి.జగన్నాథరావు, ఉపాధ్యాయులు, కూటమి నాయకులు లంకలపల్లి

మాట్లాడుతున్న ఎఎంసి మాజీ చైర్మన్ తోటయ్యదొర

శ్రీనువాసరావు, లంకలపల్లి జగన్, దొర రాజారమేష్, శంకరరావు, సీతారామరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. బుడుమూరు జెడ్‌పి పాఠశాలలో ఒక్కరోజు పాఠశాల యాజమాన్య కమిటీ శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం యు.శ్రీనువాసరావు, ఉపాధ్యాయులు పూజారి గోవిందరావు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న ప్రసన్నరాణి

చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మండలంలోని చాకిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఎం.అనురాధ అధ్యక్షతన కేస్ నిర్వాహకులు కుప్పిలి ప్రసన్నరాణి వన్‌స్టాఫ్ సెంటర్ల ద్వారా సోమవారం చట్టాలపై అవగాహన కల్పించారు. ఆడపిల్లలను చదివించడం, వారి స్వీయ రక్షణ, ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, సురక్షిత స్పర్శ, సైబర్ నేరాలు, బాల్యవివాహాలు, వరకట్న వేధింపులు, గృహహింస, మానవ అక్రమ రవాణా, అత్యాచారాలు వంటి పలు అంశాలపై వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిరాశ్రు లకు జిల్లా మహిళా, శిశు అభివృద్ధిశాఖ ద్వారా హోమ్స్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని అన్నారు. ఆడపిల్లలకు, మహిళలకు ఎటువంటి కష్టం కలిగినా 100, 1098, 181, 112 హెల్ప్‌లైన్ నంబర్లకు సమాచారం అందించాలని సూచించారు. ఆపద సమయంలో ఉన్న మహిళలకు ఆపన్నహస్తంగా ఒన్‌స్టాప్ సెంటర్లు ఉన్నాయని వివరించారు. బాలికలు ఉన్నత విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో సచివాలయం మహిళా కానిస్టేబుల్ ప్రమీల, ఉపాధ్యాయులు కె.నారాయణరావు, పి.ఋషి, పి.చిన్నారావు, కె.మురళీకృష్ణ, ఆర్. జ్యోతి, కె.సుధారాణి, మోహిని, బాడాన నారాయణరావు, రమేష్ పాల్గొన్నారు

సంక్రాంతి కానుకగా ఐఆర్, డిఎ ప్రకటించాలి

ప్రజాశక్తి- రణస్థలం

సంక్రాంతి కానుకగా ఐఆర్, డిఎలు ప్రకటించాలని అలాగే పిఆర్‌సి చైర్మన్‌ని నియమించి వీలైనంత త్వరగా పిఆర్‌సి ఇంప్లీమెంటేషన్ చేయాలని ఎపియుఎస్ మండల ప్రధాన కార్యదర్శి సింగుపురపు రాజు డిమాండ్ చేశారు. స్థానిక ఎంఆర్‌సిలో సోమవారం మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో 4, 5 తేదీ వచ్చినా ఉపాధ్యాయుల ఖాతాలో జీతాలు జమ కావడం లేదని, ఒకటి లేదా రెండవ తేదీల్లో జీతాలు జమ అనేది ఈ ప్రభుత్వంలో మూన్నాళ్ళ ముచ్చటైందని ఆరోపించారు. రాష్టంలో ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు పిఆర్‌సి, ఐఆర్, డిఎలు డిమాండ్ చేయాల్సిన తాము చివరికి ఒకటో తేదీన జీతాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేయాల్సిన పరిస్థితి దాపురించిందని వాపోయారు. ఎన్నికల్లో అధికారంలోకి వస్తే ప్రతినెలా

మాట్లాడుతున్న రాజు

ఒకటో తేదీన జీతాలు వేస్తామని, మెరుగైన పిఆర్‌సి ఇస్తామని, డిఎలు ఎప్పటికప్పుడు ఇస్తామని హామీఇచ్చి ఇప్పుడు ఇచ్చిన హామీలన్నీ తుంగలో తొక్కడం సమంజసం కాదన్నారు. అలాగే అనవసర యాప్‌ల భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆపస్ మండల అధ్యక్షులు జి.చిన్నికృష్ణం నాయుడు, జిల్లా కార్యదర్శులు జి.వి. గౌరీ, ఎస్.శ్రీధర్, యం.రవిభట్లు, ఎస్.వేణు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

నౌపడ: సంతబొమ్మాళి మండలం దండుగోపాలపురం మూలపేట పోర్టులో ఫుడ్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న వ్యక్తి సోమవారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్టు ఎస్ఐ సింహాచలం తెలిపారు. విజయనగరం జిల్లా తెర్లాం మండలం ఉత్తరావల్లికు చెందిన వావిల పల్లి సురేష్ (25) మూలపేట పోర్టులో మెస్ సెక్షన్‌లో పనిచేస్తున్నారు. దండుగోపాలపురంలో అద్దెకు ఉంటున్న నివాసం ఉంటున్నాడు. సోమవారం ఎవరు లేని సమయంలో ఫ్యాన్ కొంక్యానికి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. తోటి సిబ్బంది వచ్చి చూసి వెంటనే పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆత్మహత్య గల కారణాలు తెలియాల్సి ఉంది.

సురేష్ మృతదేహం

ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు పెంపునకు చర్యలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి జిల్లాలో ఓటర్ల నమోదు పెరిగేలా చర్యలు తీసుకోవాలని పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎం.వి.రామచంద్రరెడ్డి కోరారు. ఈ మేరకు డిఇఒ కార్యాలయంలో డిఇఒ తిరుమల చైతన్యను సోమవారం కలిసి విజ్ఞప్తి చేశారు. ప్రత్యేకించి ప్రయివేటు ఉపాధ్యాయులు ఓటరు నమోదు విషయంలో దిగువ స్థాయి అధికారులు ఇబ్బంది పెట్టకుండా చూడాలని కోరారు. ఓటరుగా రాజ్యాంగం కల్పించిన హక్కును ప్రయివేట్ ఉపాధ్యాయులూ సద్వినియోగం చేసుకునేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. డిఇఒను కలిసిన వారిలో తులసీవిష్ణు ప్రసాద్, శ్రీనివాసరావు, కృష్ణారెడ్డి, ఎం.వి.రావు, సత్యనారాయణ, బి.లక్ష్మణరావు, మోహన్‌రెడ్డి, అప్పలనాయుడు, అప్పలాచారి పాల్గొన్నారు.

ఎస్‌విజె విద్యార్థుల ఔదార్యం

కవిటి: కవిటి ఎస్‌విజె విద్యార్థులు తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. తలతంపరంలోని సీతయ్య ఫౌండేషన్‌లో వృద్ధుల కోసం రెండు బస్తాల బియ్యం అందించారు. ఈ సందర్భంగా వృద్ధులు విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు.

చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న ఉపాధ్యాయులు

బాలకృష్ణమ్మ సేవలు చిరస్మరణీయం

కవిటి: ఉపాధ్యాయుల జీవితాల్లో వెలుగులు నింపి, ఫెడరేషన్‌కి ఊపిరిగా నిలిచి, ఉద్యమాలతో ఉపాధ్యాయుల బతుకు మార్చిన మార్పు బాలకృష్ణమ్మ సేవలు చిరస్మరణీయమని ఎపి టీచర్స్ ఫెడరేషన్ 1938 అధ్యక్షుడు బల్ల ధర్మారావు అన్నారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో బాలకృష్ణమ్మ 12వ వర్ధంతి సభ సోమవారం నిర్వహించారు. ముందుగా బాలకృష్ణమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్ళర్పించారు. ఎపిటిఎఫ్ నాయకులు బల్లెడ లక్ష్మణమూర్తి, కొత్తపల్లి రంగా రావు, మొర్రి గోపి, గుడియా వంశి, శ్రీరామ్మూర్తి బిసాయి, పొల్లాయి వాసు, భార్గవ్, విజయకుమార్ పాల్గొన్నారు.

ప్రదర్శించిన కొయ్యబొమ్మలు

కొయ్యబొమ్మలకు జిల్లాస్థాయి గుర్తింపు

మందస: మండలంలోని చిన్నబరంపురం స్వయం శక్తి సంఘాలు తయారు చేసిన హస్తకళలు, కొయ్యబొమ్మలుకు జిల్లాస్థాయి గుర్తింపు లభించిందని ఐటిడిఎ వెలుగు ఎపిఎం పైడి కూర్మారావు తెలిపారు. శ్రీకాకుళంలో సిక్కోలు డాక్రా బజారులో హస్తకళలు, కొయ్యబొమ్మలను సోమవారం ప్రదర్శించామన్నారు. అతిథులను, సందర్శకులను మంచి ఆకర్షణీయంగా ఆకట్టుకుందన్నారు. తయారుచేసి తీసుకొని వచ్చిన మహిళా సంఘ సభ్యులు దగ్గర బాగా సరకు అమ్ముడుపోయినట్లు వివరించారు.

సైకిళ్లను పంపిణీ చేస్తున్న అబ్దుల్ ఆసిఫ్ అమీర్

సైకిళ్ల పంపిణీ

ప్రజాశక్తి- నందిగాం

నందిగాం స్టేట్ బ్యాంకు అఫ్ ఇండియా ఆధ్వర్యాన బ్యాంకు ఆవరణలో సిఎస్ఆర్ యాక్టివిటీస్ కింద పేద విద్యార్థులకు సైకిళ్లను రీజనల్ మేనేజర్ అబ్దుల్ ఆసిఫ్ అమీర్ సోమవారం మూడు సైకిళ్లను పంపిణీ చేశారు. పేద విద్యార్థులకు ఊతమిచ్చేందుకు దోహపడుతుందని హెచ్ఎం వై.హరిబాబు అన్నారు. బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి చెక్కు పంపిణీ

ప్రజాశక్తి- పోలాకి

సంపూర్ణ వైద్య సేవలు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మండలంలోని వెదుళ్లవలసకు చెందిన పల్లి కృష్ణమ్మ కుడి కాలు సర్జరీ అయ్యింది. ఆమె వైద్యం కోసం సిఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకుంది. ఈ మేరకు రూ.33,752 సిఎం సహాయనిధి నుంచి బాధితుడుకి సోమవారం చెక్కును పంపిణీ చేశారు. అలాగే మండలంలోని దీర్ఘాశికి చెందిన పల్లి రమణయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. మృతుని కుటుంబానికి రూ.లక్ష చెక్కును అందజేశారు. మండల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే శిరీష పరామర్శ

ప్రజాశక్తి- పలాస

మందస మండలం సువర్ణపురానికి చెందిన అడ్డు పోతయ్య గాయపడి కాశీబుగ్గ లాస్య ప్రియ ఆస్పత్రి చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గౌతు శిరీష సోమవారం ఆస్పత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు. జరిగిన ఘటనను విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. ఎప్పుడూ ఏ సమయంలో ఎటువంటి అవసరం వచ్చినా తనకు సమాచారం అందిస్తే తప్పకుండా సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు. ఆరోగ్యం జాగ్రత్త చూసుకోవాలని సూచించారు.